## క్లుప్తంగా

### గోదావరి మాతకు పున్నమి హారతి


జొన్నాడ పుష్కరఘాట్ వద్ద గోదావరి మాతకు హారతి ఇస్తున్న మహిళలు

**ఆలమూరు:** జొన్నాడలోని అఖండ గౌతమీ గోదావరి తీరంలో గోదావరి మాతకు అఖండ పున్నమి హారతి జరిగింది. ఆదివారం సాయంత్రం ప్రముఖ వేద పండితులు ద్విభాష్యం రవి కృష్ణ శర్మ ఆధ్వర్యంలో మహిళ భక్త బృందం సభ్యులు శాస్త్రోక్తంగా ఈ పున్నమి హారతిని చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మహిళలు స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి గౌతమీ తీరానికి చేరుకుని గోదావరి మాతకు హారతిని ఇచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక శివాలయానికి వచ్చి జ్వాల తోరణం ఉత్సవంలో పాల్గొన్నారు.

### విజేతలకు బహుమతులు


అంతర్వేదిలో ప్రశంసా పత్రాలు అందుకున్న కళాకారులతో సత్యనారాయణ

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం హైదరాబాదుకు చెందిన ప్రజాపతి ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన కల్చరల్ ప్రోగ్రాంలోని విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు వీటిని కళాకారులకు అందజేశారు. ట్రస్ట్ అధినేత ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ తదితర సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథిలైన ఏసీ సత్యనారాయణ, ఎంపీపీ మల్లిబాబులను ఆయన శాలువాతో సత్కరించారు. ప్రముఖుడు కుసుమ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### హిందూ ధర్మాన్ని రక్షించుకోవాలి

**అంబాజీపేట:** హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు బమిడిపాటి కృష్ణ మూర్తి, రామలక్ష్మి, ఆధ్యాత్మిక వేత్త రేలంగి శకంర్ కుమార్‌గౌడ్ అన్నారు. అంబాజీపేట శివారు కొత్తపాలెంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మండల విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మండల ధర్మరక్షక్ కడలి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధ చేపట్టారు.

### 400 మందికి వైద్య పరీక్షలు

**పి.గన్నవరం:** యర్రంశెట్టివారిపాలెంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. 400 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అమలాపురానికి చెందిన పలువురు వైద్య నిపుణులు వైద్య సేవలు అందించారు. సర్పంచ్ యర్రంశెట్టి త్రివేణి, ఉప సర్పంచ్ నారిన సత్యనారాయణ, నాయకులు నారిన అయ్యప్పనాయుడు, పెద్దిరెడ్డి సీతారామయ్య, మేడిది సాయిబాబు, సత్తిబాబు పాల్గొన్నారు.

### కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధానాలపై ఆందోళన

**సఖినేటిపల్లి:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ, రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం అంతర్వేదిలో రైతు సంఘాల సమాఖ్య, కార్మిక సంఘ సంయుక్త సమావేశం జరిగింది. సమావేశంలో వక్తలు ధర్నా విజయవంతం చేయాలని రైతులకు, కార్మికులకు పిలుపునిచ్చారు. నాయకులు కె.సత్తిబాబు, దేవ రాజేంద్ర ప్రసాద్, కేశవశెట్టి, బుజ్జిబాబు, చిట్టి రాజు, తిరుపతి పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీలో క్రైస్తవులకు సముచిత స్థానం


సమావేశంలో ప్రసంగిస్తున్న సుందరం

**ఆలమూరు/రావులపాలెం:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రిస్టియన్లకు సముచిత స్థానం దక్కడంతో పాటు పాస్టర్లకు గౌరవ వేతనం లభిస్తుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.సుందర విజయం అన్నారు. క్రిస్టియన్ మైనార్టీ సెల్ నియోజకవర్గం కార్యవర్గ సమావేశం రావులపాలెంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మైనారిటీ సెల్ అధ్యక్షుడు డి.శామ్యూల్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి సుందర విజయం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశంలో పాల్గొన్న నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన పాస్టర్లు పాల్గొని క్రిస్మస్ సందర్భంగా డిశంబర్ ఆరున ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని తీర్మానించారు. జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు కె.బాబూరావు, ఎస్.రాజు, జడ్సన్ బాబు, ప్రసాద్, రాజేంద్ర ప్రసాద్, శామ్యూల్, చంద్రరావు, చిన్నిబాబు, ఎనోష్ పాల్ పాల్గొన్నారు.

# వరి ప్రత్యేక గురి


పెనికేరులో తేమ శాతాన్ని తగ్గించేందుకు ఆరబెట్టిన ధాన్యం

- ధాన్యం నిల్వలపై జాగ్రత్తలు
- క్రిమి కీటకాల నిర్మూలనే కీలకం
- వ్యవసాయాధికారుల సూచనలు

**ఆలమూరు:** ఆరుగాలం శ్రమించి పండించిన పంటను సరైన మద్దతు ధరకు విక్రయించడం, ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడుకోవడం రైతులకు సవాల్‌గా మారింది. ప్రస్తుతం ఖరీఫ్ మాసూళ్ల అవుతున్నందున ధాన్యాన్ని భద్రపరుచుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. పండించిన ధాన్యాన్ని వెంటనే విక్రయించడం వల్ల కొంతమంది మిల్లర్లు తేమ అధికంగా ఉందంటూ ధరలో కోత విధించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నా అక్కడక్కడా దళారుల బెడత మాత్రం తప్పడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ధాన్యాన్ని ఆరబెట్టి కొద్ది కాలం నిల్వ చేసుకునే సమయంలో కనీస జాగ్రత్తలు పాటిస్తే రైతులు మంచి ప్రయోజనాలు పొందే అవకాశం ఉందని ఆలమూరు వ్యవసాయశాఖ సబ్ డివిజన్ అధికారి కె.నాగేశ్వరరావు చెబుతున్నారు.

పంట ఖరీఫ్ కోతలు, మాసూళ్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పుడు వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ప్రజలు పంటను ఒబ్బిడి చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ధాన్యానికి మరింత గిట్టుబాటు ధరను రాబట్టుకుననేందుకు వాటిని నిల్వ చేసుకునే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే ఈ నిల్వల్లో ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ధాన్యం దెబ్బతినే అవకాశం ఉంది. ధాన్యాన్ని నూర్చిన తరువాత ఇంటి అవసరాలు, విత్తనాల కోసం ఆరు నెలల నుంచి ఏడాది పాటు భద్రపరచుకోవలసిన అవసరం ఉంటుంది.

**తేమ శాతాన్ని తగ్గించుకోవాలి**

సాధారణంగా వరి కోతల సమయంలో ధాన్యం సుమారు 20 శాతం వరకూ తేమ ఉంటుంది. అయితే ధాన్యాన్ని ఆరబెట్టడం ద్వారా తేమ శాతాన్ని ఐదు వరకూ తగ్గించుకోవచ్చు. ధాన్యంలో సుమారు 14 శాతం మించితే బూజు పట్టే అవకాశముంది. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. క్రిమి కీటకాలు, ఎలుకల బారిన పడకుండా పంటను సురక్షిత ప్రాంతాల్లో నిల్వ చేసుకోవాలి.

**ధాన్యం నిల్వ చేసే పద్ధతి**

రైతులు తక్కువ ధాన్యం నిల్వ చేసుకునేందుకు సిమెంట్, వెదురు, లోహపు గాదెలను వినియోగించుకోవచ్చు. ఎక్కువ ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలనుకుంటే గోదాములు, గిడ్డంగులు, సిమెంట్ కాంక్రీట్ గదులను ఉపయోగించుకుంటేనే పూర్తి రక్షణ ఉంటుంది. ముఖ్యంగా క్రిమి కీటకాలు, తేమ, వర్షపునీరు లోనికి రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. ఎలుకలు ప్రవేశించే కన్నాలు ఉంటే గాజు పెంకులు ఉంచి సిమెంట్‌తో మూసివేయాలి. ధాన్యాన్ని నిల్వచేసుకునే సమయంలో కొత్త గోనె సంచులను వినియోగించాలి. తొలుత గోనె సంచుల లోపల, బయట మలథియాన్ లేదా ఎండోసల్ఫాన్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. మరుసటి రోజు ఆ గోనె సంచులను ఎండలో పెట్టిన అనంతరం ధాన్యాన్ని నింపాలి.

**ఎలుకల నివారణే ముఖ్యం**

ధాన్యాన్ని నిల్వ చేసుకునే సమయంలో ఎలుకల నివారణమే ముఖ్యం. ధాన్యం గిడ్డంగుల చుట్టూ చెత్త, చెదారం లేకుండా తరచూ శుభ్రం చేయాలి. వివిధ రకాల బోనులు, బుట్టలు ఉపయోగించి ఆప్రాంతంలోకి ఎలుకలు రాకుండా జాగ్రత్తలు పాటించాలి. ధాన్యం గిడ్డంగుల తలుపుల కింది భాగంలో జింక్ రేకులను అమర్చాలి. తీగలు, మెస్ లాంటి పరికరాలు అమర్చి గిడ్డంకులకు ఏర్పడిన రంధ్రాలను మూసివేయాలి. ఇటువంటి జాగ్రత్తలు పాటిస్తే ధాన్యాన్ని ఎక్కువ రోజులు నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది.

### జాగ్రత్తలు తీసుకోవాలి


కె.నాగేశ్వరరావు, వ్యవసాయాధికారి

నిల్వ చేసుకునే ధాన్యాన్ని నష్టపరచే క్రిమి కీటకాలపై రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సాధారణంగా నిల్వ చేసుకునే ధాన్యానికి ముక్కు పురుగు, నుసి పురుగు, వడ్ల చిలుక తదితర క్రిమి కీటకాలు ఎక్కువగా ఆశిస్తాయి.

**ముక్కుపురుగు :** ముక్కు పురుగు పంట కోయడానికి ముందు నుంచేధాన్యాన్ని నష్టపరుస్తుంది. బియ్యంలో తెల్లని పురుగులుగా కనిపించే ముక్కు పురుగు తొలుత వడ్ల గింజకు చిన్న రంధ్రం చేసి అందులోకి ప్రవేశిస్తుంది. తరువాత తన నోటి ద్వారా వెలువడే కొవ్వు పదార్థంతో ఆ రంధ్రాన్ని మూసివేస్తుంది. లోపల ఉన్న గింజను తినేస్తుంది.

**నుసి పురుగు :** పెంకు పురుగు లేదా పుచ్చ పురుగు గొట్టపు ఆకారంలో మూడు మిల్లీమీటర్ల పొడువులో ఉంటుంది. తొలిదశలో ఈ పురుగు వరి చెత్తను, తరువాత ధాన్యం పొరను, అనంతరం ధాన్యం గింజలను తినేసి పంటను తీవ్రంగా నష్టపరుస్తుంది.

**వడ్ల చిలుక :** ధాన్యానికి ఈ పురుగు ఆశిస్తే ధాన్యం అంతా చెడువాసన వస్తుంది. తల్లి కీటకం వడ్ల గింజలపై గుంపుగా చేరి గుడ్లు పెట్టి వ్యాపిస్తుంది. ఈ గుడ్లు పగిలితే అందులోని లార్వా లోపలికి పోయి ధాన్యంలో ఉన్న బియ్యాన్ని తింటుంది. అనంతరం ప్యూపా దశకు చేరక ముందే ధాన్యంపై పొట్టలో చిన్న రంధ్రం చేస్తుంది. ప్రౌఢ దశకు చేరిన తరువాత మళ్లీ ఆపురుగు రంధ్రం నుంచి బయటకు రావడం ద్వారా విసర్జించిన మలినాలతో చెడువాసన వస్తుంది. ఇది ధాన్యం బస్తాల సముదాయం, గిడ్డంగుల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనపడుతుంది.

### అందరి సహకారంతో దేశాభివృద్ధి


నగరంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

**మామిడికుదురు:** ప్రజల సహకారంతో భారత దేశం అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరాలన్నదే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరం జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఆదివారం జరిగిన సమావేశంలో భారత్ సంకల్ప యాత్ర ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్ బీఆర్అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.వేమా, సర్పంచ్ జాలెం రమణకుమారి, వైఎస్సార్‌సీపీ, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**పరుపుల వితరణ**

రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం మామిడికుదురు మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రూ.2.10 లక్షల విలువ చేసే 50 బెడ్ పరుపులను స్థానిక బాలుర, బాలికల వసతిగృహాలకు అందజేశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చేతుల మీదుగా వాటిని అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, ఎంపీటీసీ వర్ధినీడి తులసీరామ్, సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల నకుల్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, మండల శాఖ అధ్యక్షుడు భూపతి మనోహర్‌రాజు, ప్రధాన కార్యదర్శి కారుపల్లి కల్యాణ్‌బాబు ఆర్థిక కార్యదర్శి నేల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### వ్యక్తికి ఆర్థిక సాయం


ముత్యాలుకు ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే రాపాక

**సఖినేటిపల్లి:** రామేశ్వరంలో ఆదివారం అనారోగ్యంతో బాధపడుతున్న మోకా ముత్యాలుకు రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సఖినేటిపల్లి రత్నాల పేటకు చెందిన ఎన్నారై గొల్ల విజయ్ ప్రకాష్‌పై మొత్తాన్ని సమకూర్చారు. సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు, నాయకులు రాపాక సూరయ్య, కొల్లా బత్తుల అశోక్ పాల్గొన్నారు.

### ఇరువర్గాలపై కేసు

**అంబాజీపేట:** స్థల వివాదం తలెత్తడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్టు అంబాజీపేట పోలీసులు ఆదివారం తెలిపారు. ముక్కామల గ్రామానికి చెందిన బొంతు లక్ష్మీనారాయణకు అదే గ్రామానికి చెందిన కొప్పిశెట్టి నారాయణరావు, అతని కుమారులు అయ్యప్ప, వినయ్‌లకు మధ్య భూమి తగాదాలు ఉన్నాయన్నారు. ఈ నెల 25 సాయంత్రం లక్ష్మీనారాయణ స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి వస్తున్న సమయంలో నారాయణరావు, అయ్యప్ప, వినయ్ అతనిని కొట్టి గాయపరిచారు. క్షతగాత్రుడిని అమలాపురం ఆస్పత్రికి తరలించారన్నారు. లక్ష్మీనారాయణ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై పి.భగవన్నారాయణ తెలిపారు.

### పీఎంఎంవీవై గడువు పెంపు

**ఆలమూరు:** ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన (పీఎంఎంవీవై) గడువు పెంచినట్లు పెదపళ్ల, చొప్పెల్ల వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధ్వర్యంలో రెండో విడత కాన్పులో ఆడబిడ్డను ప్రసవించిన మహిళకు రూ.ఆరువేలు మంజూరు చేసేందుకు ఇప్పటికే గడువు ముగిసిందన్నారు. మహిళల సౌకర్యార్థం దరఖాస్తు చేసుకునే గడువును ఈ ఏడాది డిసెంబర్ 31 వరకూ పొడిగించారన్నారు. అర్హులైన మహిళలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

### ఘనంగా ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న నాగిరెడ్డి, ప్రభాకరరావు తదితరులు

**ఆలమూరు:** మండల కేంద్రమైన ఆలమూరులో కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. స్థానిక పసుపులేటి వారి వీధిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన వేడుకల్లో పార్టీ సీనియర్ నేత, రావులపాలెం చాంబర్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి ముఖ్య అతితులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలను పంపిణీ చేశారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, ఉప సర్పంచ్ ఉన్నమట్ల విజయకుమారి, న్యాయవాది షేక్ షరీఫ్, చల్లా భూషణం తదితరులు పాల్గొన్నారు.

### కులగణన కార్యక్రమానికి అందరూ సహకరించాలి


వన సమారాధనలో ఐక్యత చాటుతున్న ఎమ్మెల్సీ కుడుపూడి, తదితరులు

**పి.గన్నవరం:** రాష్ట్రంలో త్వరలో జరుగనున్న కులగణన కార్యక్రమానికి అందరూ సహకరించాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. నాగుల్లంక గ్రామంలో శ్రీవిఘ్నేశ్వర శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వన సమారాధన నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు కంకటాల ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడుపూడి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో గుర్తింపు లేని చిన్న, చిన్న కులాలకు, సంచార జాతులకు, ఈ కులగణనతో న్యాయం జరుగుతుందన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి శెట్టిబలిజపై ప్రేమ, ఆప్యాయతలు ఎక్కువని వివరించారు. రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘ గౌరవాధ్యక్షుడు గుబ్బల బాబ్జీ, సంఘ అధ్యక్షుడు దొమ్మేటి ఉమామహేశ్వరరావు, నాయకులు గుత్తుల ధర్మ, చెల్లుబోయిన శ్రీనివాస్, బొక్కా ఏడుకొండలు, పితాని నర్సింహరావు, నాని, పి.ఏడుకొండలు, గుబ్బల శ్రీనివాస్, జోగి జనార్ధనరావు, కడలి ప్రసాద్, లక్ష్మణ్, మొల్లేటి శ్రీనివాస్, చిట్టూరి శ్రీరాములు, శ్రీనివాస్, స్వామి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### గడప గడపకూ నిధులతో రోడ్డు నిర్మాణం


రాజోలు ఎండీ ఆస్పత్రి వీధిలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

**రాజోలు:** గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.15 లక్షల నిధులతో రాజోలులో ఎండీ ఆస్పత్రి వీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. సుమారు 400 మీటర్ల మేర సీసీ రోడ్డు పనులను ఇటీవల ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. రాజోలులోని నాలుగు గ్రామ సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.80 లక్షల నిధులు ఎమ్మెల్యే రాపాక మంజూరు చేశారు. అలాగే ఇటీవల రాజోలు ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో బైపాస్ రోడ్డును రూ.90 లక్షల ఆర్అండ్‌బీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే రాపాక రూ.రెండు కోట్లు నిధులు విడుదల చేశారని సర్పంచ్ రేవు జ్యోతి, పార్టీ ప్రధాన కార్యదర్శి మట్టా ఏడుకొండలు, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీ ఈశ్వరి, కొపనాతి పుష్పలత, గ్రామశాఖ అధ్యక్షుడు కొపనాతి దుర్గారావు, నాయకులు దార్ల పెదబాబు, బండారు కాశీ, అడబాల జానకీరామ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

### అంతర్వేది ఆలయానికి పోటెత్తిన భక్తులు

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తిక మాసంలో ఆదివారం సెలవు రోజు కావడంతో స్వామి దర్శనానికి వేలల్లో తరలివచ్చారు. స్వామివారి సన్నిధికి సుమారు 12 వేల మంది భక్తులు వచ్చినట్టు అంచనా వేసినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. స్వామివారి ప్రత్యేక దర్శన టిక్కట్లు అమ్మకం ద్వారా రూ.1,93,600, లడ్డు ప్రసాదం టిక్కట్లు అమ్మకం ద్వారా రూ.76,305, వివిధ ఆర్జిత సేవల టిక్కట్లు అమ్మకాల ద్వారా రూ.47,724, ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్ట్‌కు భక్తుల విరాళాలు ద్వారా రూ.1,51,100 కలిపి మొత్తం రూ.4,68,729 ఆదాయం సమకూరినట్టు కూడా ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా క్యూలైన్లల్లో భక్తులకు ఏ విధమైన అసౌకర్యం లేకుండా ఉండేందుకు ఆయన తగిన చర్యలు చేపట్టారు. అలాగే క్యూలైన్లల్లో భక్తులకు తాగునీటి వసతికి కూడా దేవస్థానం ఏర్పాట్లు చేసింది.

### ఘనంగా జ్వాలా తోరణం


వాడపల్లిలో జ్వాలా తోరణం నిర్వహిస్తున్న దృశ్యం

**ఆత్రేయపురం:** కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి క్షేత్రపాలకుడు కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి జ్వాల తోరణం కార్యక్రమం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు. దీంతో శివనామస్మరణతో ఆలయం మారుమ్రోగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్‌రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

**పి.గన్నవరం:** కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి పి.గన్నవరంలోని గరుడేశ్వరాలయం వద్ద జ్వాలా తోరణం కార్యక్రమం వైభవంగా జరిగింది. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కార్తిక పౌర్ణమి నోములు తీర్చుకున్న మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి గరుడేశ్వరాలయంలో పూజలు చేశారు. ఆలయం చుట్టూ కార్తిక దీపాలు వెలిగించారు.

**అయినవిల్లి:** స్థానిక విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలోను, నేదునూరు సర్వమంగళ పార్వతీ సమేత చెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలోను, ముక్తేశ్వరం క్షణముక్తేశ్వరుని ఆలయంలో ఆదివారం జ్వాలా తోరణం నిర్వహించారు. స్వామివార్లను పల్లకీలో ఉంచి తోరణం కింద నుంచి ఊరేగించారు.

**నయనానందం.. కోటి దీపోత్సవం**

**ఆలమూరు:** చొప్పెల్లలోని పార్వతి మాలేశ్వర స్వామి ఆలయంలో కార్తిక కోటి దీపోత్సవం కనుల పండువగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి కార్తిక దీపాలను వెలగించారు. అనంతరం ఆయా శివాలయాల వద్ద నిర్వహించిన జ్వాలతోరణం విశేషంగా ఆకట్టుకుంది.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్రేయపురంలో ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులు తదితరులు

**ఆత్రేయపురం:** మండల కేంద్రం ఆత్రేయపురం మహాత్మాగాంధీ ఉన్నత పాఠశాలలో 1972–73 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. అందరూ ఆ నాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని, రోజంతా ఆనందంగా గడిపారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు డీవీహెచ్ సుబ్బారావు, సత్యనారాయణ చౌదరి, ఖండవల్లి కేశవ చార్యులు, ప్రస్తుత సంస్థల కరస్పాండెంట్ సెక్రటరీ పీఎస్‌రాజులను సన్మాంచి నూతన వస్త్రాలను బహూకరించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త పాతపాటి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ నంబూరి కృష్ణంరాజు, ఆత్రేయపురం వెంకట రమణ, ముదునూరి సీతారామరాజు, ఎం. సత్యనారాయణరాజు, పానకాలు, దండు వెంకట్రాజు, ఆర్. కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

### మాజీ సైనికుడి మృతికి సంతాపం


పాకా లూథర్ (ఫైల్)

**పి.గన్నవరం:** ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విశ్రాంత ఉద్యోగి పాకా లూథర్ (79) శనివారం రాత్రి పి.గన్నవరంలోని తన నివాసం వద్ద మృతి చెందారు.ఆయన బీఎస్ఎన్ఎల్ సంస్థలో సూపర్‌వైజర్‌గా కూడా సేవలు అందించారు. ఆయనకు భార్య, కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. లూథర్ మృతిపై పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

### మండలానికి చేరుకున్న అయోధ్య అక్షతలు

**ఆలమూరు:** ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్యలో రామ మందిరం ట్రస్టు పంపించిన అక్షతలు ఆదివారం ఆలమూరుకు చేరుకున్నాయి. ఆలయ ప్రారంభోత్సవ సందర్భంగా భక్తులకు ఈ అక్షతలను అందజేసి ఆహ్వానించనున్నట్టు విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి దూలం వీర వెంకట గనిరాజు తెలిపారు. స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ వ్యవస్థాపకులు ఎం.ముకేందరస్వామి నేతృత్వంలోని అయ్యప్ప భక్త బృంద సభ్యులు అక్షతలకు ఊరేగించి ఆలయంలో ఉంచారు. ఆలయ ప్రధాన అర్చకులు అంగర వేణుగోపాలాచార్యులు పూజలు నిర్వహించి తొలుత ఈ అక్షతలను తొమ్మిది మంది దంపతులకు అందజేయనున్నట్టు వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి గనిరాజు తెలిపారు. అనంతరం మండలంలోని భక్తులందరికీ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డిసెంబర్ 25 లోపు ఈ అక్షతలను భక్తులందరికీ పంపిణీ చేయనున్నామన్నారు. జనవరి 22న జరిగే రామ మందిరం ప్రారంభోత్సవానికి ప్రతి ఒక్కరూ రావాలని ఆహ్వానించనున్నామన్నారు.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి
- ఆయన సేవలను కొనియాడిన వక్తలు


మానేపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు


మలికిపురం పూలే, అంబేడ్కర్ భవనంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాపాక


నగరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వేమా


కొత్తపేట డిగ్రీ కళాశాలలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దిరాజు

**పి.గన్నవరం:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మానేపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం ఆయన పూల మాలలువేసి, నివాళులు అర్పించారు. కార్పొరేషన్ డైరెక్టర్ మద్దుల వరలక్ష్మి, పార్టీ రాష్ట్ర నాయకుడు పితాని నర్సింహరావు, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారు నాయుడు, నాగభూషణం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. పి.గన్నవరంలో రాష్ట్ర మాలల జేఏసీ కో కన్వీనర్ కోట రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మూడు రోడ్ల సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. సర్పంచ్ బొండాడ నాగమణి, నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, నల్లా పెద కాపు, పమ్మి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

**ప్రపంచ దేశాలకు ఆదర్శం భారత రాజ్యాంగం**

**కొత్తపేట:** భారతదేశ రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే పెద్దిరాజు అన్నారు. ఆదివారం 74వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగం అధ్యాపకురాలు వీ నాగదీపిక, ఎన్ఎస్ఎస్ పీఓ డీసీహెచ్ పాపారావు సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దిరాజు అధ్యక్షతన పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అమలాపురం జిల్లా అదనపు కోర్టు న్యాయవాది యార్లగడ్డ రవీంద్ర ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ప్రిన్సిపాల్ రాజు, పలువురు అధ్యాపకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**రాజ్యాంగం దేశానికే వెన్నెముక**

**అంబాజీపేట:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం దేశానికే వెన్నెముక అని ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు అన్నారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని అంబాజీపేట బస్టాండ్ వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కొర్లపాటి కోటబాబు, కుసుమ శ్రీను, ఉందుర్తి నాగబాబు, మైలా ఆనందరావు, మట్టపర్తి హరి, చింతపల్లి వెంకటేశ్వరరావు, కుడుపూడి సత్తిబాబు, నేదునూరి ఏసు తదితరులు పాల్గొన్నారు.

**మామిడికుదురు:** నగరం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో జెడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, ఎంపీటీసీ జాలెం అనూషా, కో ఆప్షన్ సభ్యుడు అబ్బాస్, పార్టీ నాయకులు యు.వీ.వీ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**మలికిపురం:** స్థానిక పూలే, అంబేడ్కర్ భవనంలో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ముఖ్య అతిథిగా పాల్గొని, అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.